
# సినీ బేతాళ కథలు





– డా. కె.వివేకానందమూర్తి

*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

## - 21 -

## - ఏమినీకాను -

**విక్రమార్కుడు** మళ్లీ బేతాళుడి శవాన్ని తన భుజం మీద వేసుకుని నడక సాగించాడు.

'విక్రా! నీకు శ్రమ తెలియకుండా వుండేందుకు మరో కథ చెబుతాను విను!'- అని బేతాళుడు మొదలెట్టాడు.

"యామినీఖాన్ అనే హీరోయిన్ యెన్నో తెలుగు సినిమాల్లో యెంతో గొప్పగా నటిస్తూ, యెంతో అందంగా అలరిస్తూ అతి బిజీగా ప్రేక్షక హృదయాల్ని దోచేస్తోంది. ఆమె అసలు పేరు జోగులాంబ. నాటకాల్లో నటిగా పేరు తెచ్చుకుంది. ముఖ్యంగా సీతాకళ్యాణం నాటకంలో సీత పాత్రకు ప్రాణం పోసింది. సీత వేషం నాటకంలోగాని, సినిమాలోగాని యెక్కడున్నా అంతా జోగులాంబనే కోరేవారు.

జోగులాంబ ఏ భేషజం లేని సింపుల్ వనితగా గౌరవింపబడేది.

మొదటిసారి సినిమాలో సీతగా నటించమని ఒక నిర్మాత జోగులాంబని అడుగుతూ 'మీరు నాటకంలో సీత యేసం సింపేత్తారు. యుగసూడు నా తల్లే - తెరమీదకి మీరు సీతాదేవి అంటే పెజలు పడిపడీ దన్నాలెట్టేత్తారు' - అన్నాడు.

అప్పుడు జోగులాంబ, చిన్న చిరునవ్వుతో, -నేను కేవలం నటనే జీవితంగా నమ్ముకుని జీవించే ఒక సాధారణ యువతిని. అంతకుమించి నేను యేమినీకాను -' అంది.

అప్పుడా నిర్మాత - 'బేస్! మీకు సికిరీన్ నేము సెటప్పయి పోయింది. యేమినీకాను - అంటే యామినీ ఖాన్ - తల్లీ యామినీఖాన్ మీకు సరైన యెండి తెరపేరు. ఇటు మా గొప్ప సటయిర్‌గా వుంటది. అటు పేచ్చకజనాలకి బాలీవుడ్ దురదా తీరుద్ది - అన్నాడు.' అవాళనుంచీ జోగులాంబ - యామినీఖాన్ అయి నంబర్ వన్ హీరోయిన్‌గా తెరమీద వెలుగులు చిమ్ముతూ వుంది.

యామినీఖాన్‌కి యెన్నో ఎవార్డులొచ్చాయి. ఎన్నో షీల్డులు, కప్పులు, సాసర్లు అందుకుంది. ఎన్నో విదేశాల తెలుగు ప్రేక్షకులు ఆహ్వానించి సన్మానాలు చేశారు.

అయినా యామినీఖాన్ తెలుగు నాటకాల్ని మాత్రం వదల్లేదు. ఎన్ని షూటింగ్‌ల్లో వున్నా ఏళ్లతరబడి 'సీతాకళ్యాణం' నాటకంలో సీత పాత్ర నటిస్తూ తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో సీతగా స్థిరపడిపోయింది.

నాటకం ఔచిత్యాన్ని ప్రతీ సభలోనూ ప్రస్తావిస్తుంది. 'నాటకం, సినిమా, టి.వి అనే మొక్కలకి బీజం. అందుకే విదేశాల్లో సినిమాలకంటే నాటకానికి ఆదరణ యెక్కువ. ఒకే నాటకం ఏళ్ల తరబడి హౌస్‌ఫుల్‌గా నడుస్తుంది. కానీ మన తెలుగు దేశంలో నాటకానికి ఆ గౌరవం యెందుకు కరువైందో తెలియదు. విదేశాల్లో నాటకాల్లో నటించే నటులకు మిగతా నటులందరికన్నా మర్యాద, గౌరవం మిన్న. నాటకాల నటుడు నివసించే వీధుల్లో యిళ్ల రేట్లు పెరిగిపోతాయి. కానీ మరి యీ తెలుగునాట - అలాంటి ఆదరణ లేనేలేదు. నాటకాల నటులకు అద్దెకి ఇళ్ళు యివ్వరు. నాటకాల వాళ్ళని తేలిక చేస్తారు. నాటకాలాడుతున్నావా? అని నాటకాన్ని తిట్టుగా కూడా వాడుతారు. అందుకే మన సినిమాలు యిలా ఏడుస్తున్నాయి' అని యామినీఖాన్ యెంతగానో వాపోతుంది.

ఒకసారి యామినీఖాన్, భక్తి చిత్రాలు తీసే వొక నిర్మాతకు సూచించింది. 'సీతాకళ్యాణం' సినిమా తీసి యేళ్లు గడిచాయి "ఇప్పుడు మళ్ళీ మీరు తీస్తే బావుంటుంది" - అని. కానీ ఆ నిర్మాత దణ్ణం పెట్టేశాడు - "నావల్లకాదమ్మా - క్రితం యేడాది - 'భక్తశబరి' చిత్రం తియ్యబోయి చేతులు కాల్చుకున్నాను. శబరి పాత్రధారిణికి డయాబెటిస్ అని మాకు ముందు తెలియదు. శ్రీరాముడికి పెట్టకుండా బుట్టలకొద్దీ పళ్లన్నీ ఆవిడే తినేసేది. ఎన్నో కాల్‌షీట్స్ వేస్టయిపోయాయి. శ్రీరాముడి వేషం వేసిన హీరోగారి సహనం వీకయి కోపం లీకయి - నాకీ ధనుర్బాణాలొద్దు - గన్నొకటి తెప్పించండి - యీ ఆకలి శబరిని కాల్చిపారేస్తాను అని మైఖేల్‌జాన్సన్‌లా డాన్సు మొదలెట్టాడు. ఇక నావల్ల కాదని ఆ 'భక్తశబరి' నిర్మాణం అక్కడితో ఆపేశాను. ఇక నాకు పౌరాణిక చిత్రాలొద్దు." అని యింకోసారి దణ్ణం పెడుతూ మరో టేక్ తీసుకున్నాడు.

మళ్లీ కొన్నాళ్లు గడిచాక 'సీతాకళ్యాణం' చిత్ర నిర్మాణం ప్రకటించారు వేరే నిర్మాత. బహుళప్రచారంలో వున్న 'సీతాకళ్యాణం' నాటకంలో 'సీత'గా ప్రఖ్యాతిగాంచిన వెండితెర బంగారం, యామినీఖాన్‌ని 'సీత'గా చూస్తామని తెలుగు ప్రేక్షకులంతా ఉవ్విళ్లూరేరు.

'సీతాకళ్యాణం' కొత్త కలర్ తెలుగు చిత్రం రిలీజయింది. సూపర్ సక్సెస్ అయింది. సీత పాత్రలో నటించిన నటిని ప్రేక్షకులు ప్రశంసలతో ముంచెత్తారు.

విక్రమార్కా! ఇంతకీ చిత్రంలో సీతగా జీవించిన నటి ఎవరో తెలుసా? యామినీఖాన్ కాదు. ఆమె సమీరా సోమయాజీ. ఎన్నో యేళ్లుగా ప్రేక్షక హృదయాల్లో చెరగని ముద్రవేస్తూ నాటకరంగానికి సేవలందిస్తున్న స్టేజ్ సీత యామినీఖాన్‌ని తలదన్ని తార సీతగా సినిమా తెరమీద వెలిగింది సమీరా సోమయాజీ. తను కలలు కన్న సీత వేషం కల్లోకూడా వూహించని విధంగా వేరే నటికి దక్కడం యామినీఖాన్‌ని బాగా కలవరపరచిన మాట నిజమే.

కాంట్రొవర్సీలతో బతికే టీవీ ఛానల్స్ అన్నీ యామినీఖాన్‌ని యింటర్వ్యూ చేస్తామన్నాయి. యామిని కాదనలేదు. యింటర్వ్యూకి ఓకె అంది.

టీవీ వారు యింటర్వ్యూలో యామినీఖాన్‌ని అడిగారు. - 'తెలుగు ప్రేక్షక హృదయాల్లో రామాయణ సీతగా చెరగని ముద్ర వేసిన మీరు, యిటీవల విడుదలైన 'సీతాకళ్యాణం' చిత్రంలో మీరు కాకుండా సమీరా సోమయాజికి సీత పాత్ర దక్కడం గురించి నిరాశచెందారా? బాధపడ్డారా? ఆగ్రహంతో కలవరపడ్డారా? -' అని.

- అదీ విక్రమార్కా! విషయం. ఇప్పుడు చెప్పు టీవీ యింటర్వ్యూలో యామినీఖాన్ టీవీ వారి ప్రశ్నకు యెలా స్పందించింది. ఏం సమాధానం చెప్పింది? - యిందుకు నువ్వు తెలిసీ బదులు చెప్పక పోయావో నీ తల వొకే కథలా పగిలి వెయ్యి తెలుగు సినిమాలవుతుంది." అని బేతాళుడు ముగించాడు.

విక్రమార్కుడు తన భుజం మీద బేతాళుడి శవాన్ని వొకసారి కండువాలా సర్దుకుని తన రిప్లై మొదలెట్టాడు -

"ఓ! బేతాళా! యామినీఖాన్ టీవీ వారి ప్రశ్నకు చెప్పిన సమాధానం యిది. - 'ఎన్నేళ్లుగానో నేను సీత పాత్రలో లీనమైపోయాను. ప్రేక్షకులంతా నన్ను మా సీతమ్మ తల్లి అనుకునేలా అయిపోయాను. డైరెక్టర్‌గారు నన్ను కాదనుకుని ఆ పాత్ర సమీరా సోమయాజికి

యివ్వడం నన్ను కలత పెట్టిన సంగతి సత్యమే. కానీ కొత్త 'సీతాకళ్యాణం' కలర్ తెలుగు చిత్రం రిలీజయ్యాక చూశాను. కదిలిపోయాను. నిజంగా సమీర నాకంటే యెన్నోరెట్లు బాగా చేసింది. సీత పాత్రకు నాకంటే యింపుగా కొత్త జీవం పోసింది. డైరెక్టర్ నిర్ణయం సరైనది. సినిమా చూడగానే ఆ వేషం నేను మిస్సయ్యాననే దిగులు మటుమాయమైపోయింది. వెంటనే వెళ్లి సమీరను పెర్సనల్‌గా కంగ్రాట్ చేశాను. ఆమెకివ్వాల్సిన మిగతా డబ్బుకూడా యిచ్చేశాను - మరి ఆ సినిమాకి నిర్మాతను నేనేకదా! -" అని యామినీఖాన్ వినయంగా జవాబు చెప్పగానే యింటర్వ్యూ చేసిన టివీ ఏంఖర్ యామిని సంస్కారానికి చలించిపోయి తన కళ్లు రెండూ తడి తడిగా వున్నాయని తెలుసుకున్నాడు.

సరిగ్గా యిలాంటి సంఘటనే వొక యింగ్లీషు చిత్ర నిర్మాణంలో జరిగింది. ఆ చిత్రం అందరూ మెచ్చిన 'మై ఫెయిర్‌లేడీ' - ఏళ్ల తరబడి ఎదురులేని నాటకం, జార్జి బెర్నాడ్‌షా సృష్టి. మై ఫెయిర్‌లేడీలో అద్భుతగాయని జూలీ ఏండ్రూస్ హీరోయిన్. షాగారి 'పిగ్మేలియన్'ను మై ఫెయిర్‌లేడీ' సంగీత నాటకంగా సంవత్సరాల తరబడి సర్వజనరంజకంగా సాటిలేని సంగీత మధురంగా ప్రేక్షక శ్రోతలకు ప్రపంచమంతా అందించారు. 'సౌండ్ ఆఫ్ మ్యూజిక్', 'మేరీ పాపిన్స్'లో తన అమృతగళంతో ఆకట్టుకున్న హీరోయిన్, 'మై ఫెయిర్ లేడీ' నాటకంలో తన గంధర్వగానంతో స్థిరపడిన హీరోయిన్ జూలీ ఏండ్రూస్. 1964లో తీసిన కొత్త 'మై ఫెయిర్‌లేడీ' చిత్రంలో జూలీ ఏండ్రూస్‌కి బదులుగా ఆడ్రీ హెబ్‌బర్న్ నటించింది. ఆడ్రీ హెప్‌బర్న్ పాడగలిగినా ఆమె చేత పాడించి తృప్తి చెందక పాటల్ని 'మార్నీ నిక్సన్' చేత పాడించి డబ్ చేశారు. మార్నీ నిక్సన్ మధురాతి మధురగాయని. ఈ మధ్యే జూలైలో ఆమె తన గంధర్వలోకానికి తిరిగి వెళ్లిపోవడం తీరనిలోటు.

ఒక యింటర్వ్యూలో జూలీ ఆండ్రూస్‌ని, కొత్త 'మై ఫెయిర్ లేడీ' తో మీకు బదులుగా, మీపాట మీరు గొప్పగా పాడగలిగినా, మిమ్మల్ని కాదని ఆడ్రీ హెప్‌బర్న్ చేత ఆ వేషం వేయించి, పాటలు డబ్బింగ్ చేస్తే మీకెలా అనిపిస్తోంది' అని అడిగితే జూలీ ఆండ్రూస్ - 'అది నేను చెయ్యాల్సిన పాత్ర', నాకు రాలేదే అని ముందుగా అనిపించినా, చిత్రం చూశాక ఆ పాత్రకి ఆడ్రీనే బెస్టు, నాకన్నా ఎన్నో రెట్లు అందం, యాక్టింగ్ ఎబిలిటీ వున్న నటి.' అని చెప్పింది.

సాటి నటి సామర్థ్యాన్ని సరసంగా గౌరవించే మేటి నటీమణులు, ఆ మాటకొస్తే నటాగ్రేసరులు యెంతమంది వుంటారు. యామినీఖాన్ అనే జోగులాంబ, జూలీ ఏండ్రూస్ అనే గంధర్వనిత కళను నిస్వార్థమైన మనస్సుతో చూడగల ఆత్మనిశ్చలాంగనలు.

- ప్రశాంతమనసంహ్యేనం
యోగినం సుఖముత్తమం
ఉపైతి శాంతరజసం |
బ్రహ్మభూతమకల్మషమ్ ||

"- మనస్సు ఆత్మను నిశ్చలంగా చూడగలిగితే, రజోగుణాలు అణగిపోవును. రజనీకాంత్ నటిస్తే కబాలికూడా కావలిసినంత కలెక్టు చేయును" అన్నారోయ్ గీతాచార్యులు శ్రీకృష్ణభగవానుడు అని విక్రమార్కుడు రొప్పి చెప్పగానే, రాజుకి మౌనభంగం కలిగి, 'నా శవం నీకెంత హెవీగా వుందో తెలియదు కాని, నువ్వు బదులు చెప్పింది మాత్రం బాహుబలి బడ్జెట్ అంత హెవీగా వుంది' అని ఎగిరి వెళ్లి మళ్లీ చెట్టెక్కేశాడు.

***(వచ్చేనెలలో మరోకథ)***

Post your comments